నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 30 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

రైతు సదస్సు గ్రాండ్ సక్సెస్

- పది మేకు పైగా తరలివచ్చిన కర్షకులు
- బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

వనపర్తి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు నిరసన సదస్సు విజయవంతమైంది. అనుకున్నదానికంటే ఉత్సాహంగా సదస్సుకు రైతులు తరలిరావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన నిరంజన్‌రెడ్డి.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న అన్యాయాన్ని, మోసాలను అడుగడుగునా ఏకిపారేస్తున్నారు. ఈ విషయాలను స్వయంగా రైతులు కూడా నిరంజన్‌రెడ్డి దగ్గర పలు కార్యక్రమాల్లో కలిసినప్పుడల్లా లేవనెత్తడంతో సదస్సు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇంత తక్కువ టైంలో ఇంతలా రైతుల వ్యతిరేకతను సర్కార్ మూటగట్టుకున్నది. సదస్సులో రేవంత్ రెడ్డి హామీలు, దేవుళ్లపై వేసిన ఒట్లు, ప్రమాణాలు, కేంద్ర కాంగ్రెస్ రథసారథులు ప్రకటించిన ఎన్నికల హామీల వీడియో క్లిప్పింగ్‌లను విని పించినప్పుడు రైతుల్లో మరింత ఆగ్రహం కనిపించింది. పది రోజులపాటు సదస్సుకు కార్యకర్తలు, నాయకులను సమాయత్తం చేసిన నిరంజన్‌రెడ్డి.. ఆయా మండలాల్లో తిరిగి చైతన్యం చేశారు. అయితే పార్టీ తరఫున ఎలాంటి రవాణా సౌకర్యం కల్పించక పోయినప్పటికీ వారి గ్రామ స్థాయిలోనే మోటర్‌సైకిళ్లు, ఆటోలు, బోలేరో వాహనాల్లో భారీగా తరలి వచ్చారు. సదస్సులో నాయకులు మాట్లాడుతున్న ప్రసంగాలను రైతులు ఆసక్తిగా వినడం.. భోజన సమయం అయినా చివరకు హరీశ్‌రావు ప్రసంగం చివరి లైన్ వరకు సదస్సులో ఒక్క రైతు కూడా కదల్లేదు. పది వేల మంది అంచనాతో ఏర్పాటు చేసిన సదస్సు రైతులు భారీగా రావడంతో మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇలా రైతుల నిరసన సదస్సు తొలిసారి ఇక్కడే ప్రారంభం కావడంతో ఇదేరీతిన అన్ని ప్రాంతాల్లో కూడా కార్యాచరణ అడుగులు పడ్డట్టైంది.

రైతు నిరసన సదస్సుకు హాజరైన రైతులు, బీఆర్ఎస్ నాయకులు

- ప్రభుత్వం మెడలు వంచి రైతుబంధు ఇప్పిస్తా..
- మోసం చేసిన సర్కారును నిలదీయాలి
- మౌనంగా ఉంటే పథకాలకు పాతరేస్తారు
- మాఫీ సగం కాలే.. రైతుబంధు అసలే లేదు
- పచ్చి మోసగాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వరికోతలకు కేరాఫ్‌గా వనపర్తి
- రైతు నిరసన సదస్సులో మాజీ మంత్రి హరీశ్‌రావు

వనపర్తి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : రైతుబంధు ఇవ్వకుంటే ఊకుం దామా..? ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని ఉరికి ద్దామా..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రైతు రుణమాఫీ పథకానికి రేషన్‌కార్డు నిబంధన విధించిన సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఉసురు తగులుతుందన్నారు. ప్రజలు ఇంకా మౌనంగా ఉంటే.. రాష్ట్రంలో ఏ ఒక్క పథకం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించబడన్నారు. గతంలో అమలు చేసిన హామీలు నిలిపి వేసిన రేవంత్ సర్కార్ కాంగ్రెస్ హామీలను సహితం 11 నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడంపై ప్రజలు అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తిలోని మర్రికుంటలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన రైతుల నిరసన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హరీశ్‌రావుతోపాటు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అంజయ్య యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 42లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 20 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసిందని, సగానికి సగం కూడా మాఫీ చేయకుండానే సీఎం రేవంత్ తనను రాజీనామా చేయమని పదే..పదే అడగడం విడ్డూరంగా ఉందన్నారు. అసంపూర్తి రుణమాఫీ అనేక రైతు కుటుంబాల్లో ఆరని చిచ్చుపెట్టిందని, కొందరు రైతులు ఆత్మహత్య కూడా చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అవసరం లేని నిబంధనను పెట్టి రైతులను అవస్థలపాలు చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్‌కు రైతులే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు అన్ని విషయాలు అర్థమయ్యాయని, మౌనంగా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పథకాలను నిలిపివేస్తుందన్నారు. ఇప్పటికే రైతుబంధు, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్టు, చేప పిల్లల పంపిణీ లాంటి వన్నింటినీ నిలిపి వేసిందని, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీలు ఏవీ అమలు చేయడం లేదన్నారు. గతంలో పథకాలు కొనసాగాలన్నా.. కొత్త హామీలు అమలు చేయాలన్నా పోరాటం చేసి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు ఉద్యమాలు పోరాటాలు కొత్తకాదని, మౌనంగా ఉండడం వల్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అవస్థలను మరింతగా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కేవలం బీఆర్ఎస్ ప్రశ్నిస్తున్నందునే అరకొరగా రుణమాఫీ చేశారని, వృద్ధులకు రూ.4వేల పింఛన్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2500, పది, ఇంటర్, డిగ్రీ చదువుకున్న విద్యార్థులకు రూ.10వేలు, 15 వేలు, 25 వేలు ఇస్తామని ప్రకటించి ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి వృద్ధుడికి రూ.20 వేలు, ప్రతి మహిళకు రూ.25 వేలు, ఆటోవారికి రూ.12 వేలు రేవంత్‌రెడ్డి సర్కార్ బాకీ పడిందన్నారు. కోతలు.. కొర్రీలతో కాంగ్రెస్ ప్రభుత్వం మొండి కేసిందని, దేవుళ్లపై ఒట్టుపెట్టి మాట తప్పడం వల్ల రాష్ట్రానికి మంచిది కాదని, అరిష్టమని చెబుతున్నారని ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నాడు వలసలకు నిలయమైన వనపర్తిని నేడు వరి కోతలకు ఆలవాలంగా మార్పు చేసిన ఘనత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిదేనన్నారు. మెడికల్ కళాశాల, జేఎన్‌టీయూ, ఫిషరీష్, అగ్రికల్చర్ బీఎస్సీ, నర్సింగ్‌లాంటి విద్యా వ్యవస్థలను ఏర్పాటు చేసి వనపర్తిని సరస్వతీ నిలయంగా నిరంజన్‌రెడ్డి మార్చారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంతలా అభివృద్ధి పనులు జరిగితే.. ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క రూపాయి పని అయినా జరిగిందా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అమలు లేక పోవడం వల్ల ప్రజలు రోడ్ల పైకి వస్తున్నారని, లక్ష ఉద్యోగాలంటూ కేవలం 20 వేలు కూడా ఇవ్వలేదన్నారు. ఆ ఉద్యోగాలు సహితం గత కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం చేసినవేనని, ఇలా అనేక విషయాలపై కాంగ్రెస్ ప్రభుత్వం మోస పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్ యార్డుల్లో రైతులు ధాన్యం విక్రయాలకు గుమిగూడతారని, ప్రభుత్వ మోసాలపై మార్కెట్లలో చర్చ పెట్టాలని హరీశ్‌రావు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. లక్ష్మీపల్లిలో బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్య జరిగి నాలుగు నెలలైనా హంతకులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్, అభిలాష్ రావు, ఇంతియాజ్ ఇసాక్, శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకుడు గులాం ఖాదర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళి..

ముందుగా పట్టణంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పూలమాలలు వేసిన అనంతరం మోటర్ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి దాదాపు కిలో మీటరు మేర సభాస్థలి వరకు ర్యాలీ నిర్వహించారు.



వనపర్తిలో హరీశ్‌రావుతో కలిసి ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్, దేశపతి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్‌పీ, మాజీ ఎంపీ రావుల, మాజీ ఎమ్మెల్యేలు బీరం, గువ్వల, అంజయ్య యాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్, బీఆర్ఎస్ నేతలు

ప్రజలకు కేసీఆర్‌పైనే నమ్మకం..

కాంగ్రెస్ హామీలకు మోసపోయిగోసపడుతున్న ప్రజలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అంటే నమ్మకం ఉంది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అసంపూర్తిగా చేసిన రుణమాఫీపై తెలంగాణ భవన్‌కు 1.60 లక్షల రైతుల ఫిర్యాదులు వచ్చాయి. తెలంగాణ భవన్‌కు ప్రభుత్వ బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్రంలో గందరగోళం నెలకొన్నది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా బీఆర్ఎస్ ఒత్తిడి తెస్తున్నదని, నిత్య విద్యార్థిలా మాజీ మంత్రి హరీశ్‌రావు చురుకుగా తన పాత్రను అలుపులేకుండా పోషిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై తనదైన ముద్ర వేసిన నిరంజన్‌రెడ్డి.. అన్యాయాలపై సదస్సు ఏర్పాటు చేసి రైతు పక్షపాతిగా నిలిచారు.

- రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ

పాలమూరుకు సీఎంగా రేవంత్ చేసిందేమిటి?

పాలమూరు బిడ్డ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి చేసిందేమిటి.? గతంలో కేసీఆర్ పాలమూరు ఎంపీగా ఉండి తెలంగాణను సాధించి పెట్టారు. నేడు సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు ఏం చేశారో చెప్పడానికి కూడా ఏమీ లేదు. రైతులు, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను స్థానిక ఎన్నికల్లో బొంద పెట్టాలి. ఇంతలా మోసం చేసినప్పటికీ ప్రజలు ఇంకా కండ్లు తెరవకపోతే రానున్న రోజుల్లో మరిన్ని కష్టాల్లోకి వెళ్లాల్సి వస్తుంది. అయితే జిల్లా కేంద్రంలో నూతన కార్యాలయాలు నిర్మాణం చేసే దశలో అక్కడి భూముల్లో కొంతమంది పేద రైతులుంటే వాళ్లకు నచ్చచెప్పి కొన్ని ప్లాట్లు ఇచ్చాం. వాటి విషయంలో కొందరు నాయకులు చేరి వాటిని గందరగోళం చేసే పని చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. అలా చేసి రైతులను మోసం చేస్తే మాత్రం రణరంగం సృష్టిస్తాం. అవసరమైతే అదే రైతులకు ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ తీసుకొచ్చి తోడ్పాటునందించాలి. అధికారం చేతిలో ఉందని ఇష్టమొచ్చినట్లు చేస్తామంటే ఊరుకునేది లేదు. పక్క నియోజకవర్గంలో ఉన్న మంత్రి ఇక్కడ మేము తీసుకొచ్చిన కళాశాలలు, ఇతర కార్యాలయాల్లో వారి నియోజకవర్గానికి చెందిన వారిని నియమిస్తుంటే, ఇక్కడున్న అధికార పార్టీ నాయకులు ఏం చేస్తున్నారు. మంత్రి హోదాలో మీరు గొప్ప అభివృద్ధిని తీసుకుని వచ్చి ఉపాధి కల్పిస్తే సముచితంగా ఉంటుంది. ఒకటి కాదు.. రెండు కాదు 20 ఏండ్లకు పైగా అధికారంలో ఉంటూ పక్క నియోజకవర్గంలో వేలు పెట్టడం సమంజసం కాదు. అయితే అన్ని విషయాలు తెలిసిన చిన్నారెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదు. నియోజకవర్గంలో జరుగుతున్న అన్యాయాలపై స్పందించాలి. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను కేటీఆర్, హరీశ్‌రావు విజయవంతంగా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తున్నారు.

- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి

కార్యకర్తలకు అండగా ఉంటాం..

కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, పెడుతున్న కేసులకు ఎవరూ బెదరొద్దు. బీఆర్ఎస్ పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుంది. సర్కారు చేస్తున్న అన్యాయాలపై ప్రశ్నించినా, సోషల్ మీడియాలో పెట్టినా కేసులు పెడుతున్నారు. మహబూబ్‌నగర్‌లో పేదల ఇండ్లను కూల్చి వేశారని ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైలుకు పంపించారు. ఎవరి సంతోషం కోసం కేసులు పెడుతున్నారో.. కొంత మంది పోలీసుల వ్యవహార శైలితో అందరికీ చెడ్డ పేరు వస్తుంది. ఎన్ని కేసులు పెట్టినా ఎవరూ భయపడొద్దు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది. ధర్మపోరాటంలో మనమే గెలుస్తాం. ఉమ్మడి పాలమూరు గడ్డ పౌరుషానికి నిదర్శనం. మోసపోతే గోసపడతామని కేసీఆర్ ముందే చెప్పారు. చివరకు అదే జరిగింది. ఇక పోరాటం తప్పా మరొకటి లేదు.

- శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి

కిసాన్.. జవాన్ ఎవరూ సంతోషంగా లేరు..

రాష్ట్రంలో ఇటు రైతులు అటు పోలీసులు సంతోషంగా లేరు. రైతులకు గతంలో అందిన పథకాలతో పాటు కొత్త హామీల అమలు అస్తవ్యస్తంగా ఉన్నందునా రైతు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి అలాగే పోలీసు కుటుంబాల మధ్య చిచ్చుపెట్టి స్పెషల్ పోలీసుల కుటుంబాల్లో ఆరని చిచ్చు పెట్టారు. జై జవాన్.. జైకిసాన్ అన్న నినాదానికి కాంగ్రెస్ సర్కార్ పెద్ద మచ్చ తీసుకొచ్చింది. పోలీసు కుటుంబాలను పోలీసులతోనే కొట్టి.. కేసులు పెట్టించడం ఎంత దుర్మార్గమో ఆలోచించాలి. రాష్ట్రంలో గూండాగిరి కొనసాగుతుంది. గద్దెదిం పుతాం. స్వయంగా స్పీకర్ నోటి నుంచి గాంధీ దవాఖానకు వెళితే చనిపోతాడనే మాటలు వస్తున్నాయంటే కాంగ్రెస్ పాలన ఎలా ఉందో అర్థమవుతుంది. రాష్ట్రంలో గురుకులాలకు ఓనర్లు తాళాలు వేసే పరిస్థితిని గడిచిన పదేండ్లలో ఎప్పుడైనా చూశామా? నేడు గురుకులాల్లో కనీసం మంచి భోజనం కూడా అందడం లేదు.

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నేత

కాంగ్రెస్ మోసాన్ని రైతులు ఊహించలేదు..

మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతలా మోసం చేస్తుందని రైతులు ఊహించలేదు. నిత్యం హరీశ్‌రావుపై విమర్శలు చేస్తున్న మంత్రి జూపల్లి, అతని హయాంలో కొల్లాపూర్‌లో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నారా? 20 ఏండ్లకు పైగా అధికారంలో ఉండి చేసిన పనులు.., నేను ఐదేండ్లు ఎమ్మెల్యేగా ఉండి చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధం కావాలి. ఓట్ల కోసం రైతులను మోసం చేసిన ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో తగిన శాస్తి చేయబోతున్నారు.

- బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే

కక్ష పూరిత పాలన సాగుతోంది..

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పూర్తిగా కక్ష పూరితంగా కొనసాగుతుంది. రైతులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఇలా ఒక్కొక్క చోటా.. ఒక్కొక్కతీరుతో భయానక పరిస్థితులను కల్పించి కాలం గడుపుకోవాలని రేవంత్ సర్కార్ చూస్తున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసే బెదిరింపులకు భయపడేది లేదు. మరింత సంఘటితంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తాం. కార్యకర్తలను బెదిరించి ఎంతకాలం మనుగడ సాగించలేరని త్వరలో తగిన గుణపాఠం ప్రజలే ఇస్తారు.

- గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు

సంతోషంగా గడిపిన రైతులు కష్టాల పాలయ్యారు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు మళ్లీ కష్టాల్లో పడ్డారు. గత పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతులంతా సంతోషంగా గడిపారు. సాగునీరు, కరెంట్, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎరువులు తదితర సమస్యలు లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. పది నెలలు గడుస్తున్నా రైతుభరోసా వేయకుండా కాంగ్రెస్ సర్కార్ నట్టేట ముంచింది. రైతుల కష్టాలు తొలగాలంటే కాంగ్రెస్ పాలనకు చరమ గీతం పాడాలి.

- అంజయ్యయాదవ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే

సిగరెట్ దొంగల అరెస్ట్

జడ్చర్ల, అక్టోబర్ 29 : సిగరెట్ కాటన్లు ఎత్తుకెళ్లిన దొంగలను పట్టుకున్నారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. జడ్చర్ల శ్రీ రాంనగర్ కాలనీలోని ఆర్‌కే ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న శ్రీ రాఘవేంద్ర ఏజెన్సీ గోదాం షెట్టర్ తాళాలను ఈనెల 20న పగలగొట్టి అందులోని రూ.32 లక్షల విలువైన 32 కాటన్ల సిగరెట్లను దొంగిలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. మంగళవారం జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. రాజస్థాన్‌లోని బయవార్ జిల్లా జతరాన్ తహసీల్ పరిధిలోని బులుండ, బాన్‌జాకురి, బుదారం గ్రామాలకు చెందిన ఏ-1 మానిక్‌చంద్ కుమావత్, ఏ-2 కైలాశ్ కుమావత్, ఏ-4 గన్‌పత్ కుమావత్ పట్టుబడ్డారు. దొంగిలించిన సిగరెటు కాటన్లు అమ్మేందుకు హైదరాబాద్ నుంచి కర్నూలుకు వెళ్తుండగా.. అనుమానంతో వారిని పోలీసులు పట్టుకొని విచారించారు. దీంతో చోరీ చేసింది తామేనని ఒప్పుకొన్నారు. వీరి నుంచి రూ.27.70 లక్షలతో పాటు బొలేరో వాహనాన్ని రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

ఉత్కంఠగా ఖోఖో పోటీలు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 29 : జిల్లా కేంద్రంలోని స్టేడియంలో మంగళవారం 43వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠగా కొనసాగాయి. ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. రెండోరోజు హోరాహోరీగా సాగిన పోటీలు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన టోర్నీ రాత్రి ఫ్లడ్ లైట్స్ వెలుతురులో సెమీఫైనల్ మ్యాచ్ కొనసాగించారు. బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు 24-04 తేడాతో ఖమ్మం జట్టుపై గెలుపొందగా, మెదక్ జట్టు 14-12 తేడాతో కరీంనగర్‌పై, నల్లగొండ జట్టు 20-08 తేడాతో మహబూబ్‌నగర్‌పై, ఆదిలాబాద్ జట్టు 36-02 తేడాతో నిజామాబాద్‌పై, రంగారెడ్డి జట్టు 28-8 తేడాతో మెదక్ గెలుపొందాయి. బాలుర కేటగిరీలో ఆదిలాబాద్ జట్టు 36-24 తేడాతో ఖమ్మంపై, మెదక్ జట్టు 28-24 తేడాతో కరీంనగర్‌పై, వరంగల్ జట్టు 30-20 తేడాతో నల్లగొండపై, రంగారెడ్డి జట్టు 22-18 తేడాతో మహబూబ్‌నగర్‌పై, ఆదిలాబాద్ జట్టు 24-14 తేడాతో హైదరాబాద్‌పై, మెదక్ జట్టు 36-30 నిజామాబాద్‌పై గెలుపొందాయి. బుధవారం ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

సెమీఫైనల్స్‌కు చేరిన జట్లు..

బాలుర విభాగంలో రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్.. బాలికలలో అదిలాబాద్, నల్లగొండ, రంగారెడ్డి సెమీఫైనల్స్‌కు చేరాయి. నేడు ఫైనల్ మ్యాచ్ కొనసాగనున్నది.

తలబడుతున్న ఆదిలాబాద్, ఖమ్మం జట్లు

సొంత నిధులతో కాల్వ పూడికతీత

- రూ.3లక్షలకు పైగా రైతులపై భారం
- స్పందించని అధికారులు

పెద్ద చెరువు కింద కాల్వ పూడిక తీయించుకుంటున్న రైతులు

మాగనూరు, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని పెద్ద చెరువు కింద కాల్వల ద్వారా రైతుల పంట పొలాలకు సాగునీరు అందడం లేదని సొంత నిధులతో కాల్వ పూడిక తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. మంగళవారం రైతులు బావ కుంట మారెప్ప, బుడ్డ మారెప్ప, మోన పురం నర్సింహ, దేవప్ప మాట్లాడుతూ మండలకేంద్రంలోని పెద్ద చెరువు కింద 329 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నామని, అయితే కాల్వల్లో తుంగ, పిచ్చి మొక్కలు మొలిచి సాగునీరుకు అడ్డుగా మారడంతో కాల్వల్లో పూడిక తీయాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చేసేది లేక చెరువు కింద పంటలు సాగు చేసిన ప్రతి రైతు రూ.వెయ్యి చొప్పున రూ.3,29,000తో పూడికతీత చేపట్టామన్నారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టుకోవడం ఇబ్బందికరంగా ఉన్నా.. పంటలు కాపాడుకోవడానికి మేమే సొంతంగా డబ్బులు వేసుకోవడం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇరిగేషన్ డీఈ సురేశ్‌ను వివరణ కోరగా.. రైతులు సొంత నిధులతో కాల్వల పూడిక తీసుకుంటున్నారనే విషయం మా దృష్టికి రాలేదని, సమస్య ఉంటే రైతులు మాకు వినతిపత్రం అందించినా ప్రభుత్వానికి పంపించి నిధులు మంజూరైన వెంటనే పనులు చేసే వారమని అన్నారు.

రాజేశ్వరికి కొవ్వొత్తులతో నివాళి

గద్వాల అర్బన్, అక్టోబర్ 29 : బాలిక రాజేశ్వరి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. రాజేశ్వరి మృతిని నిరసిస్తూ మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి రాజేశ్వరి చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన రాజేశ్వరి సీడ్ ఆర్గనైజర్ ఇంట్లో పని చేసేదని, ఆమెపై అక్రమంగా బంగారు ఆభరణాలు అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసి ఆత్మహత్య చేసుకునేలా అవమానించారన్నారు. రాజేశ్వరి మృతికి కారణమైన నిందితుడు బండ్ల రాజశేఖర్‌రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై డీజీపీ కూడా ఫిర్యాదు చేస్తామని, రాజేశ్వరి కుటుంబానికి మా సమితి అండగా ఉంటుందన్నారు. అంతకుముందు డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, లవన్న, రంగస్వామి, వెంకట్రాములు, శ్రీనివాస్, కార్తీక్, విష్ణు, ప్రేమ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు